క్లుప్తంగా

వీధి వ్యాపారులు పేర్లు నమోదు చేసుకోండి

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరంలోని వివిధ ప్రాంతాల్లో రోడ్లు, వీధులు వెంబడి వ్యాపారాలు చేసుకునే వీధి విక్రయదారులందరికీ సర్వే నిర్వహిస్తున్నామని, వారంతా తమ పేర్లను నమోదు చేసుకోవాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. గతంలో నగరంలో 17వేల మంది వీధి విక్రయదారులను గుర్తించామని, అప్పుడు నమోదు చేసుకోని వారంతా తాజాగా నమోదు చేసుకోవాలని సూచించారు. సర్వేకు వీఎంసీ వార్డు వెల్ఫేర్ సెక్రటరీలు, వీఎంసీ పట్టణ సాధికార విభాగం రిసోర్స్ పర్సన్‌లు వస్తారని, వారికి రూ. 200 చెల్లించి ఏరకమైన వ్యాపారం చేస్తున్నారు?, ఎంతకాలం నుంచి చేస్తున్నారు? ఎక్కడ వ్యాపారం చేస్తార? అనే ప్రశ్నలతో సర్వే చేస్తారని, సర్వే అనంతరం వీధి వ్యాపారాలకు అడ్డంకులు లేకుండా టౌన్ వెండింగ్ కమిటీ ఆధ్వర్యంలో గుర్తింపు కార్డును అందిస్తారని అన్నారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో వ్యాపారాలు చేసుకునేవారంతా ఈ సర్వేలో తమ పేర్లు, వ్యాపారాలు నమోదు చేసుకుని అడ్డంకులు లేకుండా వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు.

దుర్గమ్మకు నృత్యార్చన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో శుక్రవారం విజయనగరంనకు చెందిన పలువురు కళాకారులు నృత్య ప్రదర్శన ఇచ్చారు. విజయనగరానికి చెందిన శ్రీనాట్య తరంగిణికి చెందిన 40మందికి పైగా కళాకారులు అమ్మవారి సన్నిధిలో కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం కళావేదికపై ఏ.విజయలక్ష్మి పర్యవేక్షణలో చిన్నారులు పలు కీర్తనలకు చక్కటి హావభావాలతో నృత్య ప్రదర్శన ఇచ్చారు. భక్తులు చిన్నారులను అభినందించారు. నృత్య ప్రదర్శన అనంతరం శిష్యబృందానికి అమ్మవారి దర్శనం కల్పించిన ఆలయ అధికారులు ప్రసాదాలను అందించారు.

తల్లీ, కుమార్తె అదృశ్యం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): తల్లీ, కుమార్తె అదృశ్యమైన ఘటనపై కొత్తపేట పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ జక్కంపూడి కాలనీకి చెందిన బాడికేల సంతోష్ కుమార్, దివ్యభారతీలు భార్యభర్తలు. వీరికి ఐదేళ్ల కుమార్తె లౌక్యవల్లి సంతానం. సేల్స్ మ్యాన్‌గా సంతోష్‌కుమార్ పని చేస్తుంటాడు. గత నెల 28వ తేదీన రాజీవ్‌గాంధీ పార్కులో తమ స్నేహితులందరూ కలుస్తున్నారని చెప్పి తన కుమార్తెతో దివ్య భారతీ బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. అప్పటి నుంచి వారి కోసం తెలిసిన వారిని, బంధువులు, స్నేహితులను ఆరా తీసినా ప్రయోజనం లేకపోయింది. దీంతో తన భార్య, కుమార్తె కనిపించడం లేదంటూ సంతోష్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

దుర్గమ్మ సేవలో ఏపీసీపీడీసీఎల్ చైర్మన్



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను ఏపీసీపీడీసీఎల్ చైర్మన్, ఎండీ పొగాకు పుల్లారెడ్డి దంపతులు శుక్రవారం దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన పుల్లారెడ్డి దంపతులకు ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేదపండితులు వారికి ఆశీర్వచనం అందించారు. అనంతరం ఆలయ ఈవో శీనానాయక్ అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందించారు. దర్శనానంతరం పుల్లారెడ్డి ఈవో శీనానాయక్‌తో మాట్లాడే క్రమంలో దేవస్థాన సోలార్ ప్లాంట్ అంశాన్ని ప్రస్తావించారు. సోలార్ ప్లాంట్ ద్వారా 1.20లక్షల యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి కాగా, లక్ష యూనిట్లను దేవస్థానం వినియోగిస్తుందని పుల్లారెడ్డికి వివరించారు. మిగులు విద్యుత్ నెట్ మీటరింగ్ గురించి తెలుపగా, సోమవారం ఈ సమస్య పరిష్కారం అయ్యేలా చేద్దామని హామీ ఇచ్చారు. ఎంతో కాలంగా పరిష్కారం లభించని అంశం ఆలయంలో పరిష్కారం అయిందని, తద్వారా దేవస్థానానికి ఆర్థికంగా లబ్ధి చేకూరుతుందని ఈవో శీనానాయక్ తెలిపారు.

10న టీచర్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): సత్యనారాయణపురం కేంద్రీయ విద్యాలయంలో ఖాళీగా ఉన్న టీచర్ ఉద్యోగాలను కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేసేందుకు ఈనెల 10వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ ఎస్. ఆది శేషశర్మ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉద్యోగాల భర్తీకి గానూ ఇప్పటికే దినపత్రికలలో ప్రకటన ఇచ్చామని తెలిపారు. సోషల్, ఇంగ్లిష్, ఒకేషనల్ కోర్సు, సంగీతం, గైడెన్స్ అండ్ కౌన్సిలర్ పోస్టులకు ఇంటర్వ్యూలను నిర్వహించి కాంట్రాక్టు పద్ధతిపై నియామకం చేయనున్నట్లు ఆయన తెలిపారు.

ఆహ్లాదం.. ఆమడ దూరం

- నిరుపయోగంగా వించిపేట రైల్వే కాలనీ పార్కు
- శిథిలావస్థకు చేరిన ఆట పరికరాలు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ఒకప్పుడు రైల్వే ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులతో ఉదయం, సాయంత్రం వించిపేటలోని రైల్వే కాలనీలో పార్కు ఎంతో సందడిగా ఉండేది. కాని నేడు రైల్వే అధికారులు పార్కు నిర్వహణను పట్టించుకోకపోవడంతో కాలనీలోని పార్కు నిరుపయోగంగా మారింది. రైల్వే ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు ఆరోగ్యం, ఆహ్లాదం పంచడంతో పాటు పిల్లలకు ఆటవిడుపుగా ఉండేందుకు 2007లో వించిపేట రైల్వే కాలనీలో పార్కు నిర్మాణం చేశారు. పచ్చదనంతో పాటు పిల్లల ఆటపరికరాలు, కూర్చునేందుకు బెంచ్‌లతో చూడటానికి ఆహ్లాదకరంగా అన్ని రకాల సౌకర్యాలు పార్కులో ఏర్పాట్లు చేశారు. దీంతో ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం సమయాల్లో ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు పిల్లలతో కలసి పార్కులో సేదతీరేవారు. అయితే ఈ పార్కు నిర్వహణ సరిగాలేకపోవడంతో ఏపుగా చెట్లు పెరిగిపోయి, పిల్లల ఆటపరికరాలు శిథిలావస్థకు చేరాయి. కనీసం కూర్చునేందుకు బల్లలు కూడా లేని అధ్వానస్థితికి పార్కు చేరింది.

నిర్వహణ లోపం

కాలనీ వాసులకు అందుబాటులో ఉండే విధంగా రైల్వే అధికారులు లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన పార్కు నిర్వహణ లోపంతో ఎందుకూ పనికిరాకుండా పోయిందని స్థానికులు వాపోతున్నారు. పెద్దలకు, పిల్లలకు మానసిక ఆరోగ్యంతో పాటు శారీరక ఆరోగ్యం కూడా అందించే లక్ష్యంతో రైల్వే అధికారులు వించిపేట రైల్వే కాలనీలో చిల్డ్రన్స్ పార్కును ఏర్పాటు చేశారు. ఆ సమయంలో రకరకాల ఆటపరికరాలు, తాగునీరు, పూల చెట్లతో పార్కు ఎంతో సుందరంగా తీర్చిదిద్దారు.



పిచ్చిమొక్కలతో అధ్వానంగా మారిన పార్కు



వించిపేట రైల్వే కాలనీలోని చిల్డ్రన్స్ పార్కు

క్రమేణా వాటి నిర్వహణ లోపించడంతో పార్కులో పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. ఆట పరికరాలు తుప్పు పట్టి పనికిరాకుండా పోవడంతో పిల్లలు కాలనీలోని రోడ్లపైనే ఆడుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.


విష పురుగుల సంచారం

కాలనీలోని పిల్లల కోసం ఏర్పాటు చేసిన పార్కులో పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించి ఆహ్లాదకర వాతావరణ ఏర్పాటు చేయడంతో పాటు పాడైపోయిన ఆట పరికరాలకు మరమ్మతులు చేపడితే పెద్దలకు, పిల్లలకు ఎంతో ఉపయోగంగా ఉంటుందని కాలనీవాసులు చెబుతున్నారు. ముఖ్యంగా దట్టంగా పెరిగిన మొక్కలతో పార్కులో పురుగు, పుట్ర వస్తున్నాయి. దీంతో పిల్లలను అటుగా పంపించాలంటేనే భయపడాల్సిన పరిస్థితి నెలకొందని తల్లిదండ్రులు చెబుతున్నారు. రైల్వే అధికారులు పార్కుపై దృష్టి పెట్టి తగిన చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.



తుప్పుపట్టి ప్రమాదకరంగా మారిన జారుడు బల్ల

ఇంద్రకీలాద్రిపై లైటింగ్, మ్యూజిక్ సిస్టమ్ మాయం!



విద్యుత్ కాంతుల వెలుగులో బంగారు గోపురం(ఫైల్)



డాక్యుమెంటరీని చూస్తున్న అప్పటి ఈవో కోటేశ్వరమ్మ, భక్తులు(ఫైల్)

- రూ.3కోట్లతో ఏర్పాటు..
- ప్రస్తుతం వెలగని లైట్లు
- కనిపించని తెర, సామగ్రి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో రూ.కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన లైటింగ్, మ్యూజిక్ సిస్టమ్ మాయమైంది. 2018లో అప్పటి ఈవో కోటీశ్వరమ్మ హయాంలో దుర్గగుడిలో సుమారు రూ. 3కోట్ల వ్యయంతో ఆలయ ప్రాంగణంలో మ్యూజిక్, లైటింగ్‌ను ఏర్పాటు చేశారు. రోజూ సాయంత్రం అమ్మవారికి పంచహారతుల సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలోని లక్ష్మీగణపతి విగ్రహం వద్ద తెర ఏర్పాటు చేసి అమ్మవారి ఆలయ విశిష్టత గురించి కథనాన్ని డాక్యుమెంటరీ రూపంలో ప్రదర్శించేవారు. ఇందుకోసం అత్యంత ఖరీదైన ప్రొజెక్టర్‌తో పాటు సౌండ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేశారు. ఈ డాక్యుమెంటరీని చూసేందుకు సాయంత్రంవేళ అధిక సంఖ్యలో భక్తులు కొండపైకి విచ్చేసేవారు. దీనికి తోడు మ్యూజిక్ సిస్టమ్‌కు తగినట్లుగా అమ్మవారి బంగారు గోపురం చుట్టూ విద్యుత్ వెలుగులు వచ్చేలా ఏర్పాట్లు చేశారు. మ్యూజిక్ సిస్టమ్ కోసం మౌనస్వామి విగ్రహం పక్కనే ఓ గదిని సైతం నిర్మించారు. అయితే కాలక్రమంలో అధికారులు మారడం, ఆ లైటింగ్, మ్యూజిక్ సిస్టమ్ వ్యవస్థ కనుమరుగైంది. ప్రస్తుతం దేవస్థాన పరిసరాల్లో ఒక్కటంటే ఒక్క లైట్ కూడా వెలగడం లేదు. ఏడాది కిందటి వరకు కనిపించిన తెర, ఇతర సామగ్రి ఇప్పుడు కనిపించడం లేదు. మరోవైపు రూ.కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన సౌండ్ సిస్టమ్ సామగ్రి సైతం కానరావడం లేదు. దేవస్థానంలో రూ.కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన సామగ్రి కనిపించకుండా పోయినా కనీసం అడిగేవారు లేకపోయారు. అధికారులు మారినా లైటింగ్, మ్యూజిక్ సిస్టమ్ ఏర్పాటు చేసిన దేవస్థాన ఇంజినీరింగ్ సిబ్బందే ఇప్పుడు విధుల్లో ఉన్నారు..ఈ మ్యూజిక్ సిస్టమ్, లైటింగ్ వ్యవస్థ ఏమైందనే దానిపై ఈవో శీనానాయక్ దృష్టి సారించాలని భక్తులు కోరుతున్నారు.

బ్రహ్మేశ్వరరావుకు బెస్ట్ ఎన్‌సీసీ ఆఫీసర్ అవార్డు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఎస్‌కేపీవీవీ హిందూ హైస్కూల్ (కొత్తపేట)లోని ఎన్‌సీసీ ఆఫీసర్‌గా పనిచేస్తున్న బీ బ్రహ్మేశ్వరరావు యూనిట్ బెస్ట్ అసోసియేట్ ఎన్‌సీసీ ఆఫీసర్‌గా అవార్డు అందుకున్నట్లు పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాలలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ 2024–25లో హిందూ హైస్కూల్ ఎన్‌సీసీ విద్యార్థులు నిర్వహించిన సేవా కార్యక్రమాలు, డ్రిల్, సాంస్కృతిక రంగాల్లో సాధించిన ప్రగతికిగాను బెస్ట్ ఆఫీసర్ అవార్డుకు ఎంపికైనట్లు తెలిపారు. 8ఏ ఎయిర్ స్క్వాడ్రన్ ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ అజిత్ సింగ్‌రాఠీ అవార్డు ప్రకటించినట్లు చెప్పారు. పాఠశాల కమిటీ అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి తొమ్మండ్రు శేషయ్య, గోపిశెట్టి మల్లయ్య, పాఠశాల కార్యదర్శి కేవీఎల్వీ మోహనరావు పాఠశాల సిబ్బంది బ్రహ్మేశ్వరరావుకు అభినందనలు తెలిపారు.



ఘనంగా వంగవీటి రంగా జయంతి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్‌లోని శంకర్ కేఫ్ సెంటర్ వద్ద ఉన్న రంగా విగ్రహం వద్ద విజయవాడ సిటీ ఆటో ఓనర్స్ అండ్ డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, రాధా రంగా మిత్రమండలి ఆధ్వర్యంలో వంగవీటి మోహన రంగా జయంతిని శుక్రవారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నేత, సీనియర్ కాపు నాయకుడు ఆకుల శ్రీనివాస్ కుమార్, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేష్, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు యర్రంశెట్టి అంజిబాబు, ఆలమూరు సాంబశివరావు, కప్పా విజయభాస్కర శర్మ తదితరులు పాల్గొన్నారు. అలాగే రాయల్ హోటల్ సెంటర్‌లోని రంగా విగ్రహం వద్ద స్థానిక కార్పొరేటర్ మహాదేవ్ అప్పాజీరావు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

సితార జంక్షన్‌లో..

భవానీపురం(విజయవాడపశ్చిమ): స్థానిక విద్యాధరపురం వీఎమ్ రంగా (సితార) జంక్షన్‌లో శుక్రవారం మాజీఎమ్మెల్యే వంగవీటి మోహనరంగా జయంతి వేడుకలు నిర్వహించారు. జంక్షన్‌లోని రంగా విగ్రహానికి కూటమి నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయని గొప్పవ్యక్తి అని కొనియాడారు. తొలుత కేక్ కట్ చేశారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు.



కేక్ కట్ చేస్తున్న ఆకుల శ్రీనివాసకుమార్ తదితరులు





- మెగా మాక్‌డ్రిల్

రైలు ప్రమాదాలు, విపత్తులపై శుక్రవారం ఫోన్ మెన్ బంగ్లా వద్ద రైల్వే అప్‌యార్డ్ కాలనీలో మెగా మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఈ మాక్ డ్రిల్‌లో రైలు కోచ్‌ల్లో ఇరుక్కుపోయిన ప్రయాణికులను అత్యాధునిక టూల్స్‌తో సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. రైలు ప్రమాదాలు జరిగినప్పుడు ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశాలను కళ్లకు కట్టినట్టు చూపించారు.

సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



నేడు వైఎస్సార్ సీపీ విస్తృత సమావేశం

భవానీపురం(విజయవాడపశ్చిమ): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశాన్ని శనివారం సాయంత్రం 6 గంటలకు భవానీపురం ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్‌లోని ఎస్ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించనున్నారు. పార్టీ పీఏసీ సభ్యులు, పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన జరగనున్న సమావేశంలో 'రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో' క్యూ ఆర్ కోడ్ ద్వారా డాక్యుమెంటరీ విడుదల చేయనున్నారు. సమావేశానికి ఎన్టీఆర్ జిల్లా పార్టీ పార్లమెంట్ పరిశీలకులు మోదుగుల వేణుగోపాలరెడ్డి హాజరుకానున్నారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లను మాజీమంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు 'చంద్రబాబు ష్యూరిటీ..మోసం గ్యారంటీ' అనే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో తప్పులు చేస్తూనే సంక్షేమ పథకాలను అందించకుండా ఏవిధంగా ప్రజలను మోసం చేస్తుందనే విషయాన్ని ప్రజలందరికీ తెలిసేలా ఈసమావేశాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. పశ్చిమ నియోజకవర్గంలో వివిధ హోదాలలో ఉన్న పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు యరడ్ల ఆంజనేయరెడ్డి, బాపతి కోటిరెడ్డి, నాయకులు కొనకళ్ల విద్యాధరరావు, కర్నాటి రాంబాబు, షేక్ మస్తాన్, వెన్నం రజని, కట్టా సత్తెయ్య, మజ్జి శ్రీనివాసరావు, కేసరి కృష్ణారెడ్డి నరేంద్ర సింగ్, కేసరి రాజశేఖర్ రెడ్డి, మెట్టు వెంకటరెడ్డి, చిచ్చా, రమణారెడ్డి, దిద్దుకూరి శివ పాల్గొన్నారు.



సమావేశం ఏర్పాట్లను పరిశీలిస్తున్న వెలంపల్లి

ప్రశ్నించే గొంతును నులిమేయటం టీడీపీకి అలవాటే

మాజీమంత్రి వెలంపల్లి

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రశ్నించే గొంతును కర్కశంగా నులిమేయడం టీడీపీకి అలవాటేనని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యులు, పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు ధ్వజమెత్తారు. వైఎస్సార్ సీపీ 44, 45 డివిజన్ల బాధ్యులు పెద్ది సత్యసాయిబాబు, సరగడ శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం వంగవీటి మోహనరంగా జయంతిని నిర్వహించారు. నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మితో కలిసి విద్యాధరపురం చెరువుసెంటర్‌లోని రంగా, గాంధీజీ విగ్రహాలకు వెలంపల్లి శ్రీనివాసరావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి మిఠాయిలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ ప్రాణం పోతుందని తెలిసికూడా ప్రజాసమస్యలపై నిరాహార దీక్షను చేపట్టిన వంగవీటి మోహనరంగా నేటి నాయకులకు ఆదర్శప్రాయుడన్నారు. ఆయనకు రక్షణ కల్పించాల్సిన నాటి టీడీపీ ప్రభుత్వ పెద్దలే ఆయన్ని దారుణంగా హత్య చేయించారనే విషయం ప్రజలందరికీ తెలుసని పేర్కొన్నారు. వీఎమ్ రంగా ఆశయాలను, ఆలోచనలను ముందుకు తీసుకువెళ్లిన వ్యక్తి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. రంగా సేవలను, త్యాగాన్ని స్మరించుకోవల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ఒక్కసారి మాత్రమే ఎమ్మెల్యేగా పనిచేసినా ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టించిన వ్యక్తి వీఎం రంగా అని కొనియాడారు. ప్రజాపక్షాన పోరాడుతూ ముష్కరమూకల హత్యాకాండలో ప్రాణాలను సైతం కోల్పోయిన వంగవీటి మోహనరంగా గురించి నేటి తరానికి తెలియాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, వైఎస్సార్ సీపీ శ్రేణులు పాల్గొన్నారు.



రంగా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వెలంపల్లి, భాగ్యలక్ష్మి, సాయిబాబు, శంకర్‌రెడ్డి తదితరులు

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలపై ధర్నా

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలపై ఏపీ పీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో విద్యాధరపురంలోని జోనల్ వర్క్‌షాప్ వద్ద రెండు రోజులపాటు నిర్వహించనున్న ధర్నా శుక్రవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు పీ దామోదర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వద్ద ఉన్న పదోన్నతుల ఫైల్‌కు వెంటనే అనుమతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సహకారంతో ఆర్టీసీ సంస్థ ఎలక్ట్రికల్ బస్‌లను కొనుగోలు చేయడంతోపాటు ఆర్టీసీ సిబ్బందితో నడిపి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించాలన్నారు. ప్రభుత్వం ఇవ్వాల్సిన పెండింగ్ డీఏ బకాయిల, 11వ పీఆర్సీ ఎరియర్స్ 24 నెలల బకాయిలను వెంటనే ఉద్యోగులకు చెల్లించాలని కోరారు. అలాగే 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించి ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఎస్ఆర్‌బీఎస్/ఎస్‌బీటీ బకాయిలను తక్షణమే చెల్లించాలన్నారు. ఈహెచ్‌ఎస్ ద్వారా సరైన వైద్య సౌకర్యాలు అందనందున ఆర్టీసీ ఉద్యోగుల విలీనానికి ముందున్న పాత పద్ధతిలోనే అందజేయాలని అన్నారు. సర్క్యులర్ నెంబర్ పీడీ.1/2019 అమలు చేసేలా స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని కోరారు. సీసీఎస్‌లో జరుగుతున్న నిధుల దుర్వినియోగంపై తగిన విచారణ జరిపించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి కే కోటేశ్వరరావు, నాన్ ఆపరేషన్ అధ్యక్షుడు వై ప్రసాద్, కార్యదర్శి వీ శ్రీధర్‌బాబు, నాయకులు సీహెచ్ కోటేశ్వరరావు, బీ పాపారావు, టీ సురేష్, డీ వెంకటపతి, ఎస్‌కె కరిముల్లా, పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దామోదర్

రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ కార్యవర్గం ఎన్నిక

రామవరప్పాడు: రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ 83వ నూతన కార్యవర్గ నియామక కార్యక్రమం శుక్రవారం రామవరప్పాడు రింగ్ సమీపంలోని ఓ హోటల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విజయవాడ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌రావు మాట్లాడుతూ రోటరీ క్లబ్ పేదలకు, విద్యార్థులకు, మహిళలకు అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. అనంతరం 2024–25 రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ అధ్యక్షురాలిగా విధులు నిర్వహించిన డాక్టర్ వి. శ్రీదేవి నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన ప్రముఖ న్యాయవాది రోటేరియన్ ఎస్. బాలగోపాల్‌కు పదవీ బాధ్యతలను అప్పగించారు. నూతన కార్యదర్శిగా ఎం. రాంగోపాల్‌రావు, కోశాధికారిగా జి. భానుప్రకాష్ నియమితులయ్యారు. వీరిచే రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ మాజీ జిల్లా గవర్నర్ డాక్టర్ కామినేని పట్టాభిరామయ్య ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం సుమారు రూ. 2లక్షలు విలువజేసే స్ట్రీట్ ఫుడ్ కార్ట్, పాఠశాల విద్యార్థులకు 3 సైకిళ్లు, 13 కుట్టు మిషన్లు, 21 రైస్ బ్యాగులు అందజేశారు. తాడికొండ శ్రీరామ్, రోటరీ అసిస్టెంట్ గవర్నర్ సుదీప్తి, ఇతర రోటరీ క్లబ్‌ల జిల్లా గవర్నర్లు, రోటేరియన్లు, రోటారాక్టర్లు, పూర్వ అధ్యక్షుడు ఎం.వి. సురేష్ పాల్గొన్నారు.




నియామక పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహనరావు, రోటరీ క్లబ్ ప్రతినిధులు

మాజీ సీఎం రోశయ్యకు ఘననివాళి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నగరపాలక సంస్థ కార్యాలయం సమీపంలోని త్రిమూర్తి చౌక్‌లో విజయవాడ అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షులు కొనకళ్ల విద్యాధరరావు ఆధ్వర్యంలో మాజీ సీఎం కొణిజేటి రోశయ్య జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వెలంపల్లి శ్రీనివాసరావు నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి తదితరులతో కలిసి కొణిజేటి రోశయ్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కేక్ కట్ చేసి పేదలకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం వెలంపల్లి మాట్లాడుతూ కొణిజేటి రోశయ్య తెలుగు సమాజానికి అద్వితీయమైన సేవలందించారని కొనియాడారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలోనే విజయవాడ నగర పాలక సంస్థ కార్యాలయం సమీపంలోగల ప్రధాన కూడలి వద్ద ఓవైపు గాంధీజీ, పొట్టిశ్రీరాములు విగ్రహాలతోపాటు మరోవైపు కొణిజేటి రోశయ్య విగ్రహం ఏర్పాటు చేసినట్లు గుర్తుచేశారు. రోశయ్య విగ్రహంతో పాటు వారి ఆశయాలను ముందుకు తీసుకువెళ్లే విధంగా జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన కొనసాగిందన్నారు. చంద్రబాబు ఎన్నికల సమయాల్లో ఇచ్చే హామీలు, తరువాత చేసే మోసాలను గురించి మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య గతంలో చేసిన వ్యాఖ్యలను గుర్తుచేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మండేపూడి ఛటర్జీ, యరడ్ల ఆంజనేయ రెడ్డి, బాపతి కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోశయ్య గొప్ప రాజనీతిజ్ఞుడు:

మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య గొప్ప రాజనీతిజ్ఞుడు అని వాసవీ క్లబ్స్ మాజీ అంతర్జాతీయ అధ్యక్షుడు వేముల హజరత్తయ్యగుప్తా కొనియాడారు. వీఎంసీ కార్యాలయం వద్ద ఉన్న రోశయ్య విగ్రహం వద్ద ఆయన జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. రోశయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



రోశయ్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వెలంపల్లి శ్రీనివాసరావు, నగర మేయర్ భాగ్యలక్ష్మి, నాయకులు